# ఇదొక పద్ధతి

బాగా తెల్లారింది. మహేశ్వరి కళ్ళు తెరిచింది, అత్తగారికి ప్రొద్దున్నే పేపరు చదివే అలవాటు. అది చదవందే ఆవిడకి కాఫీ కూడా దిగదు. బయట ఆవిడ గొంతు వినిపిస్తోంది.

"ఈ పేపరు వేసే కుర్ర వెధవకి ఎన్నిసార్లు చెప్పినా పేపరు వీధిలోంచే విసిరేసిపోతున్నాడు. నాకేమో చత్వారం. అదేమో మట్టిలో పడ్డా, మశానంలో పడ్డా నా ప్రాణం పోతోంది చదవలేక. వానొచ్చినా అంతే, వంగుడొచ్చినా అంతే. మొన్న పోయి నీళ్ళల్లోనే పడింది. ఆరబెట్టుకోలేక చచ్చాను. ఇదేమైనా బొంబాయా? కలకత్తానా? అలా విసిరేసి పోవడానికి. ఈసారి డబ్బులుకి వచ్చినపుడు నాల్గురోజులకి విరగ్గోస్తే సరి - వదుల్తుంది రోగం.

పక్కబట్టలు మడతబెడుతూ ఆలోచించ సాగింది మహేశ్వరి. పాపం అత్తగారికి "శ్రీరామ" నుంచి "శుభం" వరకు పేపరు చదివే అలవాటు. ఆ పేపరు బోయ్‌కేమో అలా దారంకట్టి విసిరేయడం అలవాటు. ఐనా అదేం దురలవాటు? డబ్బులు విరగ్గోస్తే ఏడుస్తాడు. వీడిని మార్చి ఇంకోణ్ణిపెట్టినా వాడూ యింతే గదా! ఫస్టుకి డబ్బులుకి వస్తాడుగా చూద్దాం! అనుకుంది మహేశ్వరి.

★ ★ ★

ఒకటో తారీఖు. సన్నగా వర్షం మొదలైంది.

"ఏవండమ్మా పేపరు డబ్బులు" పేపరు బోయ్ కేక.

"చిల్లర తెచ్చావా?" లోపల్నించి వస్తూ అడిగింది మహేశ్వరి.

"ఇదిగోనండి" అంటూ చిల్లర, రశీదు గడప మీద పెట్టాడు... మహేశ్వరి అవి తీసుకుని లోపలికెళ్ళింది. వర్షం మరికాస్త జోరు పెరిగింది. మహేశ్వరి బయటకొస్తూ "ఇదిగో" అంటూ, వాడు ఇటు తిరిగే లోపలే మడిచిన ఇరవై రూపాయల నోటు వాడికేసి విసిరేసింది.

వాడందుకునే లోపలే, అది గాలివాటుకి ఎగిరి వర్షంలో నేలమీద పడింది. వాడు దానివెంట ఆత్రంగా పరుగెత్తి అందుకోబోయేసరికి, మరికాస్త ఎగిరి మొక్కల్లో పడింది. ఆ పడటం ఒక చిఱు కప్పమీద పడింది. అది కంగారుపడి ఎగిరింది. ఆ ఎగరడం పేపర్‌బోయ్ మీది కెగిరింది. వాడు మరింత కంగారుపడి ఎగరబోయి తడి నేలలో కాలుజారి, తమాయించుకుని నిలబడి, వంగి నోటు తీసుకున్నాడు ప్ఛ్! కొత్త నోటు! తడిసిపోయింది. మట్టి మరకలయింది, వాడి బట్టలూ తడిసిపోయాయి.



వాడికి ఒళ్ళు మండిపోయింది. "ఏంటమ్మా ఆ విసిరేయడం? చేతికివ్వలేరా?..." ఇంకా ఏదో అనబోయి ఆలోచనలో పడ్డాడు.

ఔను, నేను మాత్రం ఏం చేస్తున్నాను రోజూ! పేపరు విసిరేస్తున్నాను. ఎప్పుడూ చేతికిచ్చే డబ్బు, ఆవిడ యివ్వాళ ఒక్కరోజే కదా విసిరేసింది - దీనికే నేనింత బాధపడుతున్నానే, డబ్బెట్టి కొనుక్కుంటున్న పేపరు మట్టిలోపడీ, నీళ్ళల్లోపడీ, రోజూ వాళ్ళెంత బాధపడుతున్నారో? ఎంత బాధపడకపోతే లక్ష్మీదేవినట్లా విసిరేస్తారు ఆడవాళు ళ్ళ! నాకేమో ఇది 'పార్ట్టైము' జాబు. దీని తరువాత ఎన్నో పనులున్నాయి. ఇక్కడే ఇలా పేపర్లు నెమ్మదిగా ఒక్కొక్క యింటికి యిచ్చుకుంటూ పోతే నాకెలా కుదుర్తుంది? అలాగని యిలా విసిరేయడం మాత్రం రైటా? ఏమో, నాదే తప్పేమో అనిపిస్తోంది. ఏ పని చేసేటప్పుడు ఆ పనికి తగిన శ్రద్ధ, గౌరవం చూపించలేనప్పుడు ఆ పని చేయడం కన్నా మానెయ్యడం మంచిదంటారు మా మేష్టరుగారు, ఇప్పుడిదే శ్రద్ధగా చేయలేనివాణ్ణి రేపు పెద్దయి, ఎన్నో బాధ్యతలు మీదపడితే ఏం చేయగలను?' అని ఆలోచించుకుంటూ మెల్లిగా తలొంచుకుని వెళ్ళిపోసాగాడు.

చాలా అల్లరి చేస్తాడనుకున్నవాడు. అలా మాట్లాడకుండా వెళ్ళిపోయేసరికి, ఆశ్చర్యపోతూ మహేశ్వరి వాడిని జాలిగా చూస్తూ అలాగే నిలబడిపోయింది.

★ ★ ★

రెండో తారీఖు. "మామ్మగారూ! పేపరు" బోయ్ కేక.

"ఈ బుద్దెప్పట్నించిరోయ్ నాయనా! చేతికిస్తున్నావు పేపరు"? అత్తగారి గొంతు.

లోపల పక్క బట్టలు మారుస్తున్న మహేశ్వరి వాడి సంస్కారానికి అభినందించకుండా ఉండలేకపోయింది.